సాక్షి నల్లగొండ

గురువారం । 5 । జనవరి । 2023



యాదాద్రిలో ముగిసిన ఆడిట్

యాదాద్రి దేవస్థానంలో ప్రసాదాల తయారీపై ఫుడ్ సేఫ్టీ బృందం చేపట్టిన ఆడిట్ పూర్తయ్యింది. - 8లో



మార్పు కోరుకుంటున్నారు

తెలంగాణ రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకుంటున్నారని బీజేపీ పాలక్, సినీ నటి డి.కవిత అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం
30.0°/19.0°

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి మోస్తారుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ : రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ పబ్లిక్ అండ్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వీరయ్య, పి.శ్రీకాంత్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికుల సంఘర్ష యాత్ర బుధవారం మిర్యాలగూడకు చేరుకోగా ఈదులగూడెం సుందరయ్య చౌరస్తా నుంచి రాజీవ్‌చౌక్, బస్టాండ్ ఎదురుగా ఉన్న లారీ ఓనర్స్ అసోసియేషన్ భవన్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవాణారంగ కార్మికులను ఇబ్బంది పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం మోటార్ వాహన సవరణ చట్టం తీసుకొచ్చిందన్నారు. కరోనా కాలం తర్వాత డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారి కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘర్ష యాత్ర ముగిసిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామన్నారు. సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, నాయకులు తిరుపతి రామ్మూర్తి, మల్లు గౌతంరెడ్డి, పార్వతి, గోవర్ధని, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, రెమడాల పరుశురాములు, రాగిరెడ్డి మంగారెడ్డి, శశిధర్‌రెడ్డి, చాంద్‌పాషా, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్‌కు ముప్పేమీ లేదు

మిర్యాలగూడ : మిర్యాలగూడ – విష్ణుపురం మధ్య రైల్వే ట్రాక్‌కు ఎలాంటి ముప్పు లేదని గుంటూరు రైల్వే డివిజన్ మేనేజర్ కార్యాలయం అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల 'సాక్షి'లో ప్రచురితమైన 'రైల్వే భూముల కబ్జా' అనే కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. రైల్వే భద్రతకు సంబంధించిన అన్ని విభాగాల అధికారులతో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. పిడుగురాళ్ల– మిర్యాలగూడ రైల్వే మార్గంలో రైళ్ల వేగం 110 కిలోమీటర్లు మాత్రమేనని తెలిపారు. రైలు కట్టను నిర్ణీత ప్రమాణాల మేరకు నిర్మించామని, తరచూ భద్రత అధికారులు, సిబ్బంది తనిఖీలు చేస్తుంటారని పేర్కొన్నారు. రైళ్లను నిర్ణీత వేగంతోనే నడుపుతున్నామని ప్రయాణికులు ఎలాంటి అపోహలకు గురికావద్దని చెప్పారు. ట్రాక్ వెంబడి స్థలాలను ఆక్రమించుకున్నట్లు రుజువైతే.. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


ఢిల్లీ సదస్సుకు నార్కట్‌పల్లి ఎంపీపీ



సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి

నార్కట్‌పల్లి : పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్‌పై ఢిల్లీలోని బీఆర్ అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో ఈనెల 5, 6 తేదీల్లో నిర్వహిస్తున్న నేషనల్ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు జిల్లా నుంచి నార్కట్‌పల్లి ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డికి అవకాశం దక్కింది. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు రాష్ట్రంలో కేవలం ముగ్గురికి అవకాశం రాగా.. అందులో నార్కట్‌పల్లి ఎంపీపీకి అవకాశం వచ్చింది. ఈ వర్క్‌షాప్‌లో పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్‌పై ప్రణాళిక తయారు చేయనున్నారు.

దళితబంధును సద్వినియోగం చేసుకోవాలి



యూనిట్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్

పెద్దఅడిశర్లపల్లి : ప్రభుత్వం అందిస్తున్న దళితబంధును సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రోళ్లకల్లులో దళితబంధు కింద మంజూరైన లబ్ధిదారుల యూనిట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన దళితబంధుతో ఆర్థిక పరిపుష్టి సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వినోద్ తదితరులున్నారు.

ఆలస్యంగా రైళ్ల రాకపోకలు



నల్లగొండ క్రైం : నిర్ణీత సమయం కంటే రైళ్ల రెండు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. పగిడిపల్లి వద్ద విద్యుత్ అంతరాయంతో విశాఖ, చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లు రెండు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురయ్యారు.

మైనార్టీ కార్పొరేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ : తెలంగాణ స్టేట్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2022–2023 సంవత్సరంలో ఆర్థిక సాయం కోసం అర్హులైన, ఆసక్తిగల ముస్లింలు, సిక్కులు, పార్సీలు, బౌద్ధులు, జైనులు నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తునట్లు జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి గోశిక బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎకనామిక్ సపోర్ట్ స్కీం కింద బ్యాంక్ లింక్డ్, నాన్ బ్యాంక్ లింక్డ్ సబ్సిడీల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ఈ నెల 5లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 94943 45471, 73865 65655 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

వేతనానికి దూరం..

అభివృద్ధి ప్రధానం



- ఏడాది కాలంలో ఎన్నో మార్పులు
- అందుబాటులోకి ఆన్‌లైన్ సేవలు
- పట్టణాభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు
- వేతనమే తీసుకోని మున్సిపల్ కమిషనర్
- నల్లగొండకు ప్రత్యేకంగా పంపిన సీఎం
- మున్సిపల్ కమిషనర్‌గా రమణాచారి బాధ్యతలు చేపట్టి నేటికి ఏడాది

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశించినట్లుగా నల్లగొండ అభివృద్ధి వేగంగా సాగుతోంది. పట్టణ రూపురేఖలు మారిపోతున్నాయి. వీటన్నింటికి కారణం మున్సిపల్ కమిషనర్ రమణాచారి పని విధానం. ఆయన వచ్చినప్పటి నుంచి పనిపైనే దృష్టి పెట్టారు. ముందుగా మున్సిపాలిటీ పాలన విధానాన్ని మార్చేశారు. ఆ తరువాత పట్టణంలో ముఖ్యమంత్రి మంజూరు చేసిన పనులపై దృష్టి సారించారు. మున్సిపల్ కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలతోపాటు పట్టణాభివృద్ధికి ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు కూడా తెప్పించారు. మున్సిపాలిటీలో వనరుల అభివృద్ధి, ఆదాయం పెంపుతోపాటు ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు సాగుతున్నారు. ఆయన నల్లగొండ మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి గురువారంతో(5వ తేదీ) ఏడాది పూర్తవుతున్న సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం.

అనుక్షణం అభివృద్ధిపై దృష్టి

2021 డిసెంబరు చివరలో సీఎం కేసీఆర్ నల్లగొండ పట్టణంలో పర్యటించి అభివృద్ధికి హామీ ఇచ్చారు. అదేరోజు రమణాచారిని నల్లగొండకు రావాలని ఫోన్‌లో ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు గత ఏడాది జనవరి 5వ తేదీన మున్సిపల్ కమిషనర్‌గా విధుల్లో చేరిన రమణాచారి అనుక్షణం పట్టణాభివృద్ధి పైనే దృష్టి పెట్టి ప్రణాళికలు రూపొందించి, వాటిని అమలు చేస్తున్నారు. అభివృద్ధి మాత్రమే కాదు.. ఏడాది కాలంలో మున్సిపల్ కమిషనర్‌గా, నీలగిరి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గా వేతనమే తీసుకోని అధికారిగా రమణాచారి రికార్డు సాధించారు. తన వేతనం, వాహనం డీజిల్ వంటివి కలుపుకొని నెలకు లక్ష రూపాయలకు పైగా తీసుకునే వెసులుబాటు ఉన్నా పైసా తీసుకోకుండానే పని చేస్తున్నారు.

రూ.18 కోట్లతో యూజీడీ పనులు

పదేళ్ల కిందట ఆగిపోయిన అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) కోసం ప్రభుత్వంతో మాట్లాడి రూ.18 కోట్లు మంజూరు చేయించి ఆ పనులను చేపట్టారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, వాన నీటి డ్రెయిన్ పనులు వచ్చే జూన్ నాటికి పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. రూ.10.5 కోట్లతో శిల్పారామం, ఛాయా సోమేశ్వరాలయం, పచ్చల సోమేశ్వరాలయం అభివృద్ధికి చర్యలు చేపట్టారు. రూ.233 కోట్లతో ఉదయ సముద్రం, కళాభారతి తదితర అభివృద్ధి పనుల కోసం సీఎం అనుమతి ఇచ్చారు. ఇవి కాకుండా అమృత్–2 కింద కొత్త కాలనీల్లో యూజీడీకి రూ.216.19 కోట్లు, వాటర్ సప్లైకి రూ.56.75 కోట్లు తీసుకురాగలిగారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఒక సమస్యపై వచ్చిన వారికి తక్షణ పరిష్కారం అందించడమే లక్ష్యం. రెండోసారి సమస్య పరిష్కారం కాలేదంటూ రాకుండా చూసుకోవడమే ముఖ్యం. సమస్య ఏదైనా పదేపదే తిరగాల్సిన అవసరం రాకుండా చూసేందుకు కృషిచేస్తున్నాం. మున్సిపల్ అధికారులు, సిబ్బంది ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం. వార్డుల్లోనూ రూ.16.69 కోట్లతో 300 పనులను చేపట్టాం. ఆదాయం పెంచాం. పట్టణంలో రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తున్నాం. ఏదోఒక ప్రాంతంలోనైనా ప్రతి రోజు నీటి సరఫరా చేయలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం.

– మున్సిపల్ కమిషనర్ రమణాచారి

రూ.కోట్లతో రోడ్ల అభివృద్ధి

కేశరాజుపల్లి నుంచి తిప్పర్తికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు, పానగల్ నుంచి సాగర్‌కు వెళ్లే నేషనల్ హైవే రోడ్డు పనులు పట్టణంలో సాఫీగా సాగేలా చూశారు. రోడ్డు వెడల్పులో భవనాలు కోల్పోయే వారితో మాట్లాడి ఒప్పించడం.., వివాదాలతో పనులు ఆగిపోకుండా చూడటంలో ఆయనది కీలక పాత్ర. పెద్ద డివైడర్లలో మొక్కల పెంపకం, సెంట్రల్ లైటింగ్ పనులు కమిషనర్ రమణాచారి నేతృత్వంలోనే కొనసాగుతున్నాయి. రూ.30.60 కోట్లతో మర్రిగూడ బైపాస్ నుంచి వివేకానంద విగ్రహం వరకు ప్రధాన రోడ్డు, వివేకానంద విగ్రహం నుంచి గడియారం సెంటర్, పెద్దబండ వరకు రూ.46 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. పాతబస్తీలో రూ.4.5 కోట్లతో చేపట్టిన రోడ్డు పనులు ఈ నెలాఖరుకు పూర్తి చేసేలా ఆదేశాలు జారీచేశారు. రూ. 2.5 కోట్లతో వల్లభరావు చెరువు సుందరీకరణ కొనసాగుతోంది. బండ్‌తోపాటు లైటింగ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు వంటి పనులు దసరా నాటికి పూర్తయ్యేలా ప్రణాళిక వేశారు. వెజ్‌నాన్ మార్కెట్, రైతు బజార్, అర్బన్ పార్క్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

13,55,482 మంది ఓటర్లు



నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	థార్డ్ జెండర్	మొత్తం
దేవరకొండ	1,15,290	1,12,466	4	2,27,760
నాగార్జునసాగర్	1,07,659	1,09,992	2	2,17,653
మిర్యాలగూడ	1,04,627	1,07,265	6	2,11,898
నల్లగొండ	1,10,222	1,14,211	25	2,24,458
మునుగోడు	1,20,817	1,19,267	9	2,40,093
నకిరేకల్	1,16,874	1,16,744	2	2,33,620
మొత్తం	6,75,489	6,79,945	48	13,55,482

- 2018తో పోల్చితే పెరిగిన 60,602 మంది
- నేడు తుది ఓటరు జాబితా ప్రకటన

నల్లగొండ : జిల్లా ఓటర్ల సంఖ్య తేలింది. ఆరు నియోజకవర్గాల పరిధిలో 13,55,482 మంది ఓటర్లు ఉన్నారు. 2018 ఎన్నికల సమయంలో 12,94,880 మంది ఓటర్లు ఉండగా.. ఆనాటి సంఖ్యతో పోల్చితే 60,602 మంది ఓటర్లు పెరిగారు. పెరిగిన వారిలో పురుషులు 27,859 మంది, మహిళా ఓటర్లు 32,743 మంది ఉన్నారు. ఎన్నికల సంఘం ప్రతి సంవత్సరం మాదిరిగానే 2022లో కూడా ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా 1జనవరి 2023 నాటికి 18 సంవత్సరాలు నిండే వారు ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. 2022 నవంబర్ 9న ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటించింది. అందులో 13,54,821 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తర్వాత 2022 డిసెంబర్ 8 వరకు ఓటరు సవరణలపై దరఖాస్తులు స్వీకరించారు. డిసెంబర్ 26 నాటికి వాటిని పరిశీలించారు. ఈనెల 5న కలెక్టరేట్, ఆర్డీఓ, తహసీల్దార్ కార్యాలయాలతోపాటు అన్ని పోలింగ్‌స్టేషన్లలో ఓటరు తుది జాబితాను ప్రకటించనున్నారు.

నిరంతరం ఓటరు నమోదు ప్రక్రియ..

ఓటరు తుది జాబితా ప్రకటన తర్వాత కూడా ఓటు నమోదు ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ 1 నాటికి, జూలై 1నాటికి, అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండేవారంతా ఓటరు నమోదు చేసుకునేందుకు అర్హులుగా ప్రకటించి ఎన్నికల సంఘం ఓటు నమోదు చేసుకోవాలని కోరుతోంది. దరఖాస్తు చేసుకున్నవారికి ఓటు నమోదు అవుతుంది కానీ, వారికి 18 సంవత్సరాలు నిండిన తర్వాతే ఆ ఓటు పరిగణనలోకి వస్తుంది.

పేదలకు చేరువగా వైద్యం



డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- సాగర్‌లో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

నాగార్జునసాగర్ : తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సారథ్యంలో పేదలకు ప్రభుత్వ వైద్యం చేరువవుతోందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక కమలా నెహ్రూ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్యాన్ని గ్రామీణ ప్రాంతాలకు విస్తరించే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గానికి ఒక డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాగర్‌లోని డయాలసిస్ కేంద్రంలో రోజుకు 20 మందికి సేవలు అందిచవచ్చని చెప్పారు. పేదవాడికి వైద్యం అందేవిదంగా తీసుకున్న చర్యల్లో భాగంగానే సాధారణ జలుబు నుంచి ప్రాణాంతకమైన క్యాన్సర్ వరకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 12 డయాలసిస్ కేంద్రాలు ఉన్నాయన్నారు. డయాలసిస్ బాధితులకు ప్రభుత్వం పింఛన్‌తోపాటు, ఆస్పత్రికి వచ్చి పోయేందుకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించిందని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రికార్ చైర్మన్ ఇస్లావత్ రామచంద్రనాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ కర్ణ అనూషారెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, జెడ్పీటీసీ అబ్బిడి కృష్ణారెడ్డి, తిరుమలగిరి(సాగర్) ఎంపీపీ భగవాన్‌నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు కర్ణ బ్రహ్మానందరెడ్డి, మన్నెం రంజిత్ యాదవ్, డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు, డీసీహెచ్‌ఎస్ మాతృనాయక్, ఆర్‌ఎంఓ బానుప్రకాశ్, తహశీల్దార్ సైదులుగౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బిన్ని, మార్కెట్ చైర్మన్లు జువ్వాజి వెంకటేశ్వర్లు, మర్ల చంద్రారెడ్డి, హాలియా మున్సిపల్ చైర్‌పర్సన్ పార్వతమ్మశంకరయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నగదు జమ చేయకుంటే గొర్రెలు ఇవ్వం!

మునుగోడు : మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా గొల్ల కురుమలకు గొర్రెలు అందించేందుకు అర్హుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన నగదును డ్రా చేసిన వారు తిరిగి వారి ఖాతాలో జమ చేయకపోతే ఆ గ్రామంలోని లబ్ధిదారులకు గొర్రెలు ఇచ్చేది లేదని పశుసంవర్థక శాఖ అధికారులు తేల్చి చెపుతున్నారు. కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన గొర్రెల పంపిణీ వ్యవహారానికి తెరదించేలా అధికారులు గొర్రెలు అందించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జిల్లాల్లోనే గొర్రెల కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చారు. ఆ మూడు జిల్లాలో ఎవ్వరూ ఏ జిల్లాలో కొనుగోలు చేస్తారో వారి అభిప్రాయాలను తీసుకొని వారిచేత ఒప్పంద పత్రం రాయించనున్నారు. అయితే నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 7400 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమచేయగా అందులో దాదాపు 460 మంది డబ్బులు డ్రా చేసుకున్నారు. అయితే ఆ నగదు తీసుకున్నవారు ఏ గ్రామంలో ఉన్నారో ఆ గ్రామ గొర్రెల కాపరి సంఘం అధ్యక్షుడితో పాటు సభ్యులు అతడిపై ఒత్తిడి తీసుకొచ్చి తిరిగి డబ్బులు జమ చేయించాలని సూచిస్తున్నారు. లేనిపక్షంలో ఆ గ్రామంలోని గొర్రెల పంపిణీని నిలిపివేస్తామని తేల్చి చెపుతున్నారు. దీంతో మునుగోడు మండలంలో మొత్తం 26 గ్రామాల్లో ఉండగా అందులో 6 గ్రామాల్లో మొత్తం 26 మంది డబ్బులు డ్రా చేసుకోగా వారిచేత నగదు జమ చేయించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు.

130మంది ఎంపిక

మిర్యాలగూడ అర్బన్ : సాంఘికశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పోటీల్లో 130 మంది విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారని ఆ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లమేకల వెంకయ్య తెలిపారు. బుధవారం మిర్యాలగూడ డివిజన్ పరిధిలో జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులను అభినందించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ నెల 7న నల్లగొండ జిల్లాస్థాయి ప్రతిభా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

మెయిన్స్‌కు 12,124 మంది అర్హత

- ముగిసిన పోలీస్ దేహదారుఢ్య పరీక్షలు
- లాంగ్ జంప్‌లోనే ఎక్కువ మంది అనర్హత
- చిన్నచిన్న సంఘటనలు మినహా ప్రశాంతంగా ఈవెంట్స్



పోలీస్ ఈవెంట్స్‌లో భాగంగా రన్నింగ్ చేస్తున్న అభ్యర్థులు

నల్లగొండ క్రైం : పోలీస్ ఉద్యోగాల ఎంపికకు నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలు బుధవారం ముగిశాయి. ఉమ్మడి జిల్లాలో పోలీస్ ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన వారికి 2022 డిసెంబర్ 8 నుంచి 2023 జనవరి 4వ తేదీ వరకు నల్లగొండలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈవెంట్స్ నిర్వహించారు. ఇక్కడ మొత్తం 26,433 మందికి గాను 23,524 ఈవెంట్స్‌కు హాజరయ్యారు. వారిలో 12,124 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించారు. ఇందులో మహిళలు 4,264 మంది ఈవెంట్స్‌కు హాజరు కాగా 2,889 మంది, పురుషులు19,260 మంది హాజరుకాగా.. 9,235 మంది ఎంపికయ్యారు. ఈవెంట్స్‌లో భాగంగా ఆలేరు మండలానికి చెందిన అభ్యర్థి స్పృహ తప్పి.. మృతిచెందారు. శాలిగౌరారానికి చెందిన ఓ మహిళా అభ్యర్థి రన్నింగ్‌లో కాలువిరిగింది. ఎక్కువ మంది అభ్యర్థులు అస్వస్థతకు గురయ్యారు.

నెగ్గిన గ్రామీణ ప్రాంత అభ్యర్థులు..

పోలీస్ ఉద్యోగాల ఎంపికలో నిర్వహించిన ఈవెంట్స్‌లో అత్యధికంగా గ్రామీణ ప్రాంత అభ్యర్థులు నెగ్గినట్లు ఈవెంట్స్‌ను పర్యవేక్షించిన పోలీస్ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. అత్యధిక మంది లాంగ్ జంప్‌లో ఆ తర్వాత, రన్నింగ్‌లో అర్హత సాధించలేక పోయారని చెప్పారు. గ్రామీణ ప్రాంత అభ్యర్థులతో పోల్చితే.. పట్టణ ప్రాంతం వారు అర్హత సాధించలేక పోయారని తెలిపారు.

వివాదం లేకుండా..

ఈవెంట్స్‌ను పోలీస్ నియామకమండలి నియమించిన ప్రత్యేక ఎస్పీ శబరీష్, జిల్లా ఎస్పీ రెమా రాజేశ్వరి, నోడల్ అధికారి, ఏఎస్పీ వరప్రసాదరావు పర్యవేక్షించారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానంతో ఎంపిక ప్రక్రియను చేపట్టారు. అభ్యర్థులకు ఎలాంటి అనుమానం వచ్చినా వెంటనే సీసీ కెమెరాల్లో రికార్డు చేసిన దృశ్యాలను చూపించారు. అభ్యర్థుల ఛాతి వద్ద రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ కార్డు, చేతికి రిస్ట్ బ్యాండ్ ఏర్పాటు చేశారు. సెన్సార్ల ఆధారంగా అభ్యర్థుల కదలికలను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు బాధ్యులు గుర్తించారు.

చివరి రోజు 1073 మంది హాజరు

ఈవెంట్స్‌లో చివరి రోజు బుధవారం 1200 మంది అభ్యర్థులకుగాను 1,073 హాజరయ్యారు. వారిలో 517 మంది అర్హత సాధించారు. ఈవెంట్స్‌కు వివిధ కారణాలతో హాజరుకాని వారికి మరోసారి దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించే విషయమై అధికారుల వద్ద ఎలాంటి సమాచారం లేదు.

యాసంగిలోనూ పత్తిసాగు

- జిల్లా వ్యాప్తంగా 300 ఎకరాల్లో పంట
- అనుకూల ఫలితాలు వస్తుండడంతో రైతుల ఆసక్తి
- నీటి సౌకర్యం ఉంటే సాగు చేయొచ్చంటున్న అధికారులు



తిరుమలగిరి (సాగర్) మండలం పిల్లిగుండ్లతండాలో యాసంగిలో సాగు చేసిన పత్తి పంట

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : యాసంగి సీజన్‌లోనూ పత్తిసాగుకు చేయొచ్చని నిరూపిస్తున్నారు.. కొందరు రైతులు. జిల్లాలోని ఈ ఏడాది తొలిసారిగా సుమారు 300 ఎకరాల్లో యాసంగి పత్తిని సాగు చేస్తున్నారు. వానాకాలంలో వర్షాధారంగా రైతులు పత్తి సాగు చేస్తుంటారు. కానీ, యాసంగిలో మాత్రం నీటి వసతి ఉన్న రైతులు పత్తిసాగు చేసి అధిక దిగుబడులు పొందవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని సంవత్సరాలుగా అక్కడి రైతులు వానాకాలంతోపాటు యాసంగిలో కూడా పత్తి సాగు చేస్తున్నారు. అక్కడి రైతుల ప్రయత్నం ఫలించడంతో రాష్ట్ర ప్రభుత్వం యాసంగిలో పత్తి సాగును ప్రోత్సహిస్తోంది. అధికారులు కూడా యాసంగి పత్తి పంటపై అవగాహన కల్పిస్తున్నారు.

నీటి సౌకర్యం ఉంటేనే సాగు..

నీటి సౌకర్యం ఉన్న రైతులు యాసంగిలో ఆరుతడి పంటలతో పాటు పత్తి పంటను కూడా సాగు చేసుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. రైతులు పంటను సాగు చేస్తే వ్యవసాయ శాఖ నుంచి అన్ని రకాలుగా సూచనలు, సలహాలు అందిస్తామని పేర్కొంటున్నారు. యాసంగిలోనూ నాలుగు నెలల్లోనే పంట చేతికొస్తుందని చెబుతున్నారు. ఈ ఏడాది తొలి ప్రయత్నంగా సాగు చేసిన రైతులు ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తారని అంటున్నారు.

పిల్లిగుట్టతండాలో 20 ఎకరాల్లో సాగు..

తిరుమలగిరి(సాగర్) మండలంలోని పిల్లిగుండ్లతండాలో ఈ ఏడాది 15 మంది రైతులు సుమారు ఇరవై ఎకరాల్లో యాసంగిలో పత్తి పంటను సాగు చేశారు. సాధారణంగా ఇక్కడ వానాకాలంలో పత్తి సాగు చేసి.. యాసంగిలో వరి, పెసర, బొబ్బెర వంటి పంటలను సాగు చేస్తుంటారు. కానీ, ఈ సారి నీటి సౌకర్యం ఉన్న రైతులు డ్రిప్ సాయంతో పత్తి సాగు చేస్తున్నారు. కొంత మంది రైతులు పంటను సాగు చేసి నెల రోజులు అవుతుండగా.. కొందరు ఇటీవలే విత్తనాలు వేశారు. యాసంలో పత్తి పంట మంచి దిగుబడిని ఇస్తుందనే నమ్మకంతోనే సాగు చేశామని ఇక్కడి రైతులు అంటున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు యాజమాన్య పద్ధతులు తెలియజేయాలని కోరుతున్నారు.

వానాకాలం నష్టం నుంచి గట్టెక్కేలా..

ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతన్నను ఏదో ఒక రూపంలో ప్రకృతి దెబ్బతీస్తుంది. వానాకాలం సీజన్‌లో పత్తి రైతులు అతివృష్టి కారణంగా తీవ్ర నష్టాలను చవిచూశారు. దీంతో పంట పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులు కూడా తీరని పరిస్థితులు నెలకొంది. వీటి నుంచి గట్టెక్కేందుకు రైతులు యాసంగిలో పత్తి పంట వైపు మొగ్గు చూపాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. యాసంగి సీజన్‌లో వర్షాలు ఉండవని.. దాని వల్ల పత్తికి తెగులుసోకే అవకాశం తక్కువగా ఉంటుందని చెబుతున్నారు.

పంట బాగానే ఉంది



నాకున్న భూమిలో మూడు ఎకరాలకు నీటి సౌకర్యం ఉంది. రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. ఇంకో ఎకరంలో నెల రోజుల క్రితమే పత్తి పంట వేశాను. ప్రస్తుతం పంట బాగానే ఉంది. కలుపుతీత పూర్తయింది. ఈ వారంలో ఎరువుల కూడా పెడతా. ఇప్పటి వరకు మాకు యాసంగి సాగుపై అవగాహన లేదు. వ్యవసాయ శాఖ అధికారులు మాకు సూచనలు, సలహాలు ఇస్తే పంటను కాపాడుకుంటూ అప్పుల ఊబీలోంచి బయటపడతాం.

– జటావత్ శీలా, రైతు పిల్లిగుండ్లతండా

రైతుల వద్దకే అధికారులు



ఈ ఏడాది జిల్లాలో మొదటగా సుమారు 300 ఎకరాల్లో రైతులు యాసంగి పత్తి సాగు చేశారు. రైతుల వద్దకే వ్యవసాయశాఖ అధికారులు వెళ్లి ఎప్పటికప్పుడు సలహాలు, సూచనలు ఇస్తారు. నీటి వసతి ఉన్న రైతులు యాసంగిలో పత్తి పంటను సాగు చేయాలి. వానాకాలం మాదిరిగానే ఎరువులు వేసుకోవాలి. ఆదిలాబాద్ జిల్లా రైతుల కొంతకాలంగా సాగుచేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు.

– సుచరిత, జిల్లా వ్యవసాయశాఖ అదికారి

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు



రోడ్డు పక్కకు వెళ్లి ఆగిన కారు

తుర్కపల్లి: ముందు వెళ్తున్న బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన మండలంలోని రుస్తాపూర్ గ్రామశివారులో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. తుర్కపల్లి మండలంలోని చౌక్లతండాకు చెందిన నరేందర్‌నాయక్ తుర్కపల్లి నుంచి భువనగిరి వైపునకు బైక్‌పై వెళ్తున్నాడు. కొద్దిదూరం వెళ్లిన తర్వాత ఎటువంటి సిగ్నల్ ఇవ్వకుండా నరేందర్‌నాయక్ బైక్‌ను పక్కకు తిప్పడంతో వెనుకనే వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన నరేందర్‌నాయక్‌కు గాయాలు కాగా, కారు రోడ్డు పక్కకు వెళ్లి ఆగింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరకుని వివరాలు సేకరించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

వలిగొండ: విద్యుత్ షాక్‌తో గేదె మృతిచెందిన సంఘటన మండలంలోని గోకారం గ్రామంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు.. గోకారం గ్రామానికి చెందిన నత్తి గోపాల్ తన వ్యవసాయం బావి వద్ద రోజుమాదిరిగా గేదెలను మేపుతుండగా రైతు వేదిక సమీపంలో విద్యుత్ వైరు తగిలి షాక్‌తో పాడి గేదె అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితుడు తెలిపాడు.

బ్యాంకు మేనేజర్‌పై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



బ్యాంకు మేనేజర్‌ను నిలదీస్తున్న రైతు

గుర్రంపోడు: రైతుబంధు డబ్బులను పంట రుణం తీసుకున్న ఖాతాలోకి మార్చడంపై నిరసన వ్యక్తం చేస్తూ ఓ రైతు బ్యాంకు మేనేజర్‌పై బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాలు.. మండలంలోని కొప్పోలు ఎస్‌బీఐ శాఖలో కొప్పోలు గ్రామానికి చెందిన ఐతరాజు అంజయ్య స్థానిక ఎస్‌బీఐ బ్యాంకులో రూ.2లక్షలు పంట రుణం తీసుకున్నాడు. అయితే అంజయ్య కుమారుడు ప్రసాద్ ఖాతాలో జమ అయిన రైతు బంధు డబ్బులు రూ.20వేలను తండ్రి రుణం తీసుకున్న ఖాతాలోకి బ్యాంకు అధికారులు మార్చారు. ఈ విషయం తెలుసుకున్న ప్రసాద్ తన ఖాతాలోని రైతు బంధు డబ్బులను తనకు తెలియకుండా తన తండ్రి రుణం తీసుకున్న ఖాతాకు ఎలా మార్చుతారని బ్యాంకు మేనేజర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. బ్యాంకు మేనేజర్ నుంచి సరైన స్పందన లేకపోవడంతో గుర్రంపోడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

వైభవంగా అధ్యయనోత్సవాలు

- మూడోరోజు ఉదయం శ్రీరాముడిగా.. రాత్రి శ్రీవేంకటేశ్వరుడిగా దర్శనమిచ్చిన లక్ష్మీనరసింహస్వామి



శ్రీరాముడి అలంకరణ సేవకు ముందు ప్రబంధ పారాయణం పఠిస్తున్న ఆచార్యులు



శ్రీవేంకటేశ్వరుడి అలంకరణలో దర్శనమిస్తున్న లక్ష్మీనర్సింహ స్వామి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో అధ్యయనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఈ ఉత్సవాలు మూడో రోజుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో సంప్రదాయ పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10గంటలకు ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో స్వామి వారిని శ్రీరాముడిగా అలంకరించి హారతినిచ్చారు. అనంతరం తిరువీధులు, మాఢ వీధిలో సేవను ఊరేగించారు. ఈ సేవకు ముందు ఆచార్యులు, పారాయణీకులు దివ్య ప్రబంధ పారాయణాన్ని పఠించారు. ఈ వేడుకలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, ఆలయ అనువంశిక ధర్మకర్త బి. నర్సింహమూర్తి, ఆలయ ఈఓ గీతారెడ్డి, ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, ముఖ్య అర్చకులు, రుత్వికులు, పారాయణీకులు పాల్గొన్నారు.

రాత్రి శ్రీవేంకటేశ్వర అలంకారంలో..

రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి అలంకారంలో స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. అంతకు ముందు ఆచార్యులు నిత్యారాధనలు నిర్వహించారు. అనంతరం పారాయణీకులచే దివ్య ప్రబంధ కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం వేంకటేశ్వరస్వామి అలంకార సేవకు ఆచార్యులు హారతినిచ్చి, తిరువీధుల్లో సేవను ఊరేగించారు.

వైశ్య ఫెడరేషన్ సేవలు అభినందనీయం

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



నూతన సంవత్సర డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట: సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ముందుండడం అభినందనీయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చల్ల లక్ష్మీకాంత్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీని మంత్రి బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో చల్ల లక్ష్మీప్రసాద్, శ్రీశైలం, నరేష్, ఎర్రయ్య, లక్ష్మణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధాంతాల కోసం పోరాడిన వ్యక్తి మల్లయ్య

- ప్రొఫెసర్ హరగోపాల్



జైని మల్లయ్య గుప్తాకు నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్ తదితరులు

భువనగిరి : నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తి జైని మల్లయ్య గుప్తా అని సామాజిక వేత్త ప్రొఫెసర్ జి.హరగోపాల్, వీక్షణం సంపాదకుడు ఎన్.వేణుగోపాల్ అన్నారు. స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జైని మల్లయ్య గుప్తా సంతాప సభ బుధవారం భువనగిరి పట్టణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడుతూ.. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటాలను ప్రారంభించి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కూడా పాల్గొన్నారని అన్నారు. జైని మల్లయ్య గుప్తా పేరుతో రచయితలకు గానీ, సామాజిక కార్యకర్తలకు గానీ అవార్డులను ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం జైని మల్లయ్యగుప్తా జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, డీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా గొర్రెల యూనిట్లు పంపిణీ

- రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ బాలరాజుయాదవ్



విలేకరులతో మాట్లాడుతున్న దూదిమెట్ల బాలరాజుయాదవ్

నల్లగొండ టౌన్: నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో డీడీలు కట్టిన లబ్ధిదారులకు ఈ నెలాఖరులోగా గొర్రెల యూనిట్లు పంపిణీ చేయడం పూర్తిచేస్తామని రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ తెలిపారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండు జిల్లాల్లో కలిపి 7661 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ. 93కోట్ల76లక్షల63వేలు జమచేసిందన్నారు. లబ్ధిదారులే నేరుగా వారు ఇష్టం ఉన్న చోట గొర్రెలను కొనుగోలు చేసుకునేందుకు గాను ప్రభుత్వం ఖాతాలల్లో డబ్బులు జమచేసిందన్నారు. గొర్రెల యూనిట్ల కొనుగోలు కోసం మండల, జిల్లా స్థాయిలో కమిటీలను ఏర్పాటుచేసి పటిష్టమైన చర్యలు తీసుకుంటామన్నారు. గొర్రెల యూనిట్లకు బీమా సౌకర్యం, రవాణా, ఫీజు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జి జేడీ డాక్టర్ అంబటి యాదగిరి, ఏడీ డాక్టర్ విశ్వేశ్వర్‌రావు, బకరం వెంకన్న, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో బ్రెయిలీ జయంతి వేడుకలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. లూయిస్ బ్రెయిలీ కనుగొన్న లిపి ప్రపంచమంతా ఉన్న అంధుల జీవితాల్లో వెలుగును నింపిందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో రంగాల్లో అంధులు ముందంజలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంక్షేమ జిల్లా అధికారి జ్యోతిపద్మ, జిల్లా వైద్యాధికారి కోటాచలం, జెడ్పీ సీఈఓ సురేష్ కుమార్, డీఎస్‌ఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్రెయిలీ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ హేమంత్ కేశవ్, జిల్లా అధికారులు

ప్రసాదాల తయారీపై ముగిసిన ఆడిట్



యాదాద్రి ఆలయంలో ప్రసాదం తయారు చేసే మిషన్‌ను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

యాదగిరిగుట్ట: యాదాద్రి దేవస్థానంలో నైవేద్యం ప్రసాదాల తయారీపై ప్రత్యేక ఫుడ్ సేఫ్టీ బృందం నిర్వహించిన తుది ఆడిట్ విజయవంతంగా పూర్తయిందని ప్రోగ్రాం రాష్ట్ర నోడల్ అధికారి జ్యోతిర్మయి అన్నారు. బుధవారం ఇండోర్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన ఫుడ్ సేఫ్టీ ఆడిటర్ వికాస్ మిశ్రా, ట్రైనర్ చాగంటి అంజనేయులు, ఫుడ్ సేఫ్టీ డెసిగ్నేటెడ్ అధికారి సుమన్ కల్యాణ్, అధికారి పి. స్వాతి యాదాద్రిని సందర్శించి దేవాలయంలో అన్నదానం, రామానుజాకూటం, ప్రసాద తయారీ, వివిధ వంటశాలలు, ఆహార పదార్థాల తయారీలో ఆచరిస్తున్న పద్ధతులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆలయ ఈఓ గీతారెడ్డి, డిప్యూటీ ఈఓ భాస్కర్, ఆలయ కమిటీతో అధికారులు సమావేశమై కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్ సాధించుకునేలా ప్రసాదం తయారీ, అన్నదానం చేసే విధానంపై పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర నోడల్ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ.. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు, రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషనర్ శ్వేతా మహంతి, ఐపీఎం శివలీల పర్యవేక్షణలో రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలను ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్లను అందజేస్తారని తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం యాదాద్రిలో ఫైనల్ ఆడిట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రసాదాల తయారీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్ పొందిన మొట్టమొదటి ఆలయంగా యాదాద్రి నిలవనుందని ఆమె పేర్కొన్నారు.

ప్లాట్లను క్రమబద్ధీకరించాలని వినతి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

భువనగిరిటౌన్: ఆలేరు మండలం గొలనుకొండ గ్రామంలోని సర్వే నంబర్లు 42, 272లో గతంలో పేదలకు ఇచ్చిన స్థలాలను క్రమబద్ధీకరణ చేయాలని కోరుతూ సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు బుధవారం యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 11.15 గుంటల భూమిని మామిడి రాంరెడ్డి వద్ద 1994 సంవత్సరంలో ప్రభుత్వం కొనుగోలు చేసి 196మంది నిరుపేదలైన ఎస్సీ, బీసీ, ఓసీ వికలాంగులకు, కుటుంబ నియంత్రణ చేసుకున్న వారికి స్థలాలు ఇచ్చారని, వాటిని క్రమబద్ధీకరణ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, నాయకులు బాలరాజు, సంగిరాజు, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నూలు ధరలను నియంత్రించాలి



మాట్లాడుతున్న హ్యాండ్లూమ్ సిల్క్, కాటన్ యార్న్ అసోసియేషన్ అధ్యక్షుడు పరమేశ్

భూదాన్‌పోచంపల్లి: ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న నూలు ధరలను నియంత్రించాలని పోచంపల్లి హ్యాండ్లూమ్ సిల్క్, కాటన్ యార్న్ అసోషియేషన్ అధ్యక్షుడు గుండు పరమేశ్ అన్నారు. బుధవారం వలిగొండ మండలం వేములకొండ దేవస్థాన ఆవరణలో అసోషియేషన్ 42వ వార్షికోత్సవ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కరోనా తరువాత నూలు ధరలు రెట్టింపు కావడం వల్ల పరోక్షంగా చేనేత పరిశ్రమ, ఇటు కార్మికుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపిందని అన్నారు. ప్రభుత్వం నూలు ధరలను తగ్గించాలని కోరారు. అలాగే చేనేత వస్త్రాలపై కేంద్రం విధించిన జీఎస్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అసోషియేషన్ వార్షిక నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో పద్మశాలీ మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ చిట్టిపోలు శ్రీనివాస్, ఆలిండియా హ్యాండ్లూమ్ హౌజ్ డైరెక్టర్ భారత వాసుదేవ్, టై అండ్ డై అసోషియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, బడుగు చండీకేశ్వర్, కౌన్సిలర్ భోగ భానుమతివిష్ణు, చేనేతకార్మిక సంఘం అధ్యక్షురాలు మెరుగు శశికళ, భారత లవకుమార్, భోగ స్వామి, అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు చేయాలి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే సైదిరెడ్డి



చండూరులో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్ నియోజకవర్గంలో శుక్రవారం పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు రాష్ట్ర మంత్రులు కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సత్యవతి రాథోడ్ రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, ఎస్పీ రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం వారు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న హెలీపాడ్, ఈఎస్ఐ డిస్పెన్సరీని సందర్శించి రూట్‌మ్యాప్‌ను, సభాస్థలి, ఆదర్శ కాలనీలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఎమ్మెల్యే నూతన క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం నూతన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకారెడ్డి, డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, సీఐ రామలింగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌సీ సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ మహిపాల్ రెడ్డి, తహసీల్దార్ దామోదర్‌రావు, బీఆర్ఎస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

చండూరులో..

చండూరు: చండూరు మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టేందుకు శుక్రవారం మంత్రులు కేటీఆర్, మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరుకానున్నట్లు మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే చండూరులోని సభా స్థలిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రూ.2కోట్లతో మున్సిపల్ భవనం, రూ.2కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్, రూ.5.50కోట్లతో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, రూ.2కోట్లతో సమీకృత మార్కెట్, రూ.22 కోట్లతో డబుల్ రోడ్ల నిర్మాణానికి మంత్రులు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్డీఓ జయచందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తోకల చంద్రకళ వెంకన్న, కమిషనర్ మణికరణ్, సీఐ అశోక్‌రెడ్డి, ఎస్ నవీన్‌కుమార్, కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు

రెండు చేనేత క్లస్టర్లు ప్రారంభం...

గట్టుప్పల మండల కేంద్రంలో, తేరట్‌పల్లి గ్రామంలో రెండు చేనేత క్లస్టర్లను మంత్రులు ప్రారంభించనున్న నేపథ్యంలో మండల కేంద్రంలో ప్రజాప్రతినిధులతో బుధవారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, ఎంపీపీ పల్లె కళ్యాణి, సర్పంచ్ ఇడెం రోజా, ఎంపీటీసీ గొరిగే సత్తయ్య, ఇడెం కైలాసం, కంచుకంట్ల సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆస్పత్రి వార్షికోత్సవం



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ పద్మజాదివాకర్‌రెడ్డి

భువనగిరిటౌన్: భువనగిరి పట్టణంలోని డాక్టర్ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం(నవ్య నర్సింగ్ హోమ్) 27వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పద్మజాదివాకర్‌రెడ్డి ఆస్పత్రిలో కేక్ కట్ చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భార్గవి, నారాయణ, ర్యాకల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మన యాదాద్రి- మన బాధ్యత'

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట : ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక క్షేత్రంగా విలసిల్లుతున్న యాదగిరిగుట్ట మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ - 2023 పోటీల్లో అవార్డు లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం ముందుకెళ్తోందది. అందులో భాగంగా 'మన యాదాద్రి - మన బాధ్యత' పేరుతో బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ హాజరై మాట్లాడారు. మనం బాగుండాలంటే ఇల్లు, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నా. అందుకోసం ప్రజలంతా తడి, పొడి చెత్తను ఇంటి దగ్గరే వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో తడి చెత్తనుంచి సేంద్రియ ఎరువు తయారీ, పొడి చెత్తను రీసైక్లింగ్ చేస్తారని తెలిపారు. తద్వారా మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. అంతేకాకుండా సేంద్రియ ఎరువును ఇళ్లలో మొక్కలు పెంచుకునే వారికి ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. గిన్నిస్ బుక్‌లో రికార్డు లిఖించే విధంగా యాదగిరిగుట్టను సర్వాంగ సుందరంగా తీర్చుకోవాలన్నదే 'మన యాదాద్రి- మన బాధ్యత' కార్యక్రమ ఉద్దేశమన్నారు. అనంతరం మన యాదాద్రి - మన బాధ్యత పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రతినిధులు మురళీ, కన్నదరావు, విపుల్, జీఎస్ఆర్ అన్నమయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, కమిషనర్ శ్రావణ్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ కాటం రాజు, మెప్మా యాదగిరిగుట్ట ఇన్‌చార్జ్ శ్యామల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌బాబు, మేనేజర్ కే.నరేష్‌రెడ్డి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వారికి రానట్టేనా?

కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతులకు అందని రైతుబంధు

- సీసీఎల్‌ఏ నుంచి రాని సమాచారం
- నిలిచిపోయిన బ్యాంకు ఖాతాల వివరాల నమోదు
- సమాచారం వస్తదా, రాదా తెలియని పరిస్థితి
- నూతన పాస్‌బుక్‌లు పొందిన రైతులు ఎనిమిది వేల మందికి పైనే
- దరఖాస్తు చేసుకున్న వారు 5,495



సాక్షి, యాదాద్రి : కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులకు ఈసారి రైతుబంధు సాయం అందే పరిస్థితి కనిపించడం లేదు. వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ వ్యవసాయ శాఖ ముఖ్య కమిషనర్ (సీసీఎల్‌ఏ) నుంచి వచ్చిన డేటాలో వారి వివరాలు లేవు. యాసంగిలో పెట్టుబడి సాయం వస్తుందని ఆశపడ్డ కొత్త రైతులు ఇప్పుడు నిరాశలో ఉన్నారు. కొత్తగా పాస్ పుస్తకాలు తీసుకున్న రైతులు జిల్లా వ్యాప్తంగా 8 వేలకు పైనే ఉన్నారు.

5,495 మంది దరఖాస్తు

రాష్ట్ర ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను అమల్లోకి తీసుకువచ్చిన తర్వాత వివిధ రకాల సాంకేతిక సమస్యల వల్ల వేలాది మంది రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు రాలేదు. ఇటీవల సమస్యలను పరిష్కరించడంతో జిల్లాలోని 17 మండలాలు, ఆరు మున్సిపాలిటీల పరిధిలో 8 వేల మందికి పైగా రైతులు కొత్త పాస్ పుస్తకాలు పొందారు. వీరిలో 5,495 మంది రైతుబంధు సాయం కోసం దరఖాస్తు చేసుకున్నారు. సరైన ప్రచారం లేకపోవడం, అవగాహన లేమితో ఇంకా 2,500 మందికి పైగా దరఖాస్తు చేయలేదు. 2022 డిసెంబర్ 20లోపు నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన వారు ఈనెల 7వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రకటించారు.దరఖాస్తు చేసుకున్న రైతులు రైతుబంధు సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

ఈనెల 4వ తేదీ వరకు వచ్చిన ధరఖాస్తులు

మండలం	దరఖాస్తులు		
భువనగిరి	659	అడ్డగూడూరు	191
యాదగిరిగుట్ట	150	చౌటుప్పల్	750
ఆత్మకూర్(ఎం)	155	బొమ్మలరామారం	553
మోటకొండూరు	300	ఆలేరు	458
గుండాల	369	పోచంపల్లి	550
వలిగొండ	547	బీబీనగర్	234
మోత్కూరు	207	తుర్కపల్లి	372

నిరాశలో రైతులు

వానాకాలం సీజన్‌లో రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు వెంటనే వారి ఖాతాల్లో నగదు జమ అయ్యింది. యాసంగిలోనూ అదే విధంగా వస్తుందని కొత్త పాస్ పుస్తకాలు పొందిన రైతులు ఆశపడ్డారు. కానీ, సీసీఎల్‌ఏ నుంచి సమాచారం రాకపోవడంతో అధికారులు సైతం ఏమీ చేయలేకపోతున్నారు. బ్యాంకు పాస్ పుస్తకం నంబర్‌ను ఎంట్రీ చేయడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ వెబ్‌సైట్ ఓపెన్ కావడం లేదని అధికారులు చెబుతున్నారు.

వివరాలు పంపని సీసీఎల్‌ఏ

నూతనంగా పట్టదారు పాస్ పుస్తకాలు తీసుకున్న రైతుల వివరాలను సీసీఎల్‌ఏ వ్యవసాయ శాఖకు పంపించలేదు. దీంతో వ్యవసాయ శాఖ కమిషనర్ వెబ్‌సైట్‌లో కొత్తగా దరఖాస్తు చేసుకున్న రైతుల వివరాలు లేవు. గతంలో మాదిరిగానే రకరకాల సాంకేతిక సమస్యలు చూపుతోంది. నూతన పాస్ బుక్ నంబర్, బ్యాంకు ఖాతా నంబర్, విస్తీర్ణం వివరాలను సీసీఎల్‌ఏ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ వివరాల ఆధారంగా ఏఈఓలు రైతుల బ్యాంకు పాస్‌పుస్తకం వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఆ తర్వాత రైతుబంధు సాయం వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది.కానీ, వెబ్‌సైట్‌లో వారి వివరాలు చూపడం లేదు.

డేటా వస్తే జమ చేస్తాం



కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన వారి డేటా సీసీఎల్‌ఏ నుంచి మాకు రాలేదు. డేటాలో పట్టాదారు పాస్ బుక్ నంబర్, రైతు పేరు ఉంటుంది. ఈ వివరాలు సీసీఎల్‌ఏ నుంచి మాకు వస్తేనే నిర్ణీత ఫార్మాట్‌లో రైతుల బ్యాంకు అకౌంట్ నంబర్ అప్‌లోడ్ చేసి వారి ఖాతాల్లో డబ్బులు జమచేస్తాం. గత సీజన్‌లలో కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన వారికి వెంటనే రైతుబంధు సహాయం అందింది. మాకు డేటా రాగానే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తాం.

–అనురాధ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి